సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



కూలిన బతుకులు

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు వారు. కూలి కాస్త ఎక్కువగా వస్తుందన్న ఆశతో జిల్లా దాటి వచ్చిన వారి జీవితాలు మధ్యలో ముగిసిపోయాయి. -8లో



ఒంటిమిట్టలో విష జ్వరాలు

ఒంటిమిట్ట మండలంలో విష జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. వాతావరణంలో నెలకొన్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



రైతు పోరు.. ఉద్యమ హోరు

పంట సాగు చేద్దామంటే
సమయానికి చినుకు రాలదు..
పంటకు సత్తువ వేద్దామంటే
బస్తా ఎరువు దొరకదు..
పంట చేతికొస్తే మద్దతు ధర దక్కదు..
ఇదేంటని అడుగుదామంటే
ప్రభుత్వం పలకదు..

కొండలా పెరుగుతున్న అప్పులు..
గుండెలపై బరువెక్కుతుంటే..
చేతికొచ్చిన పంట చేలోనే కుళ్లి పోతుంటే..
రైతన్న కంటి చెరువు కట్ట తెగక ఏమవుతుంది..
కడుపుమండి 'కూటమి'పై
తిరగబడక ఏముంది...
మనసులేని.. చేతగాని నేతల తీరుపై
దునుమాడితే తప్పెలా అవుతుంది.!

కర్షకలోక నినాదంతో.. ఉప్పొంగిన ఆగ్రహ జ్వాలలతో కలెక్టరేట్ దద్దరిల్లింది.. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలిచ్చిన జనంతో రాయచోటి నిండిపోయింది.. రైతులు, రైతు సంఘాలతో కలిసి వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరుబాట విజయవంతమైంది.

- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- ప్లకార్డులు చేతబూని.. నినాదాలతో హోరెత్తించి..
- ధర్నా చేపట్టి.. వినతిపత్రం సమర్పించి..
- కర్షకుల సమస్యల పట్ల ప్రభుత్వ తీరుపై మండిపాటు
- పరిష్కరించే వరకు పోరాడుతామని హెచ్చరిక

సాక్షి రాయచోటి: రైతుల సమస్యల పరిష్కారంలో కూటమి సర్కారు సాకులు చెబుతోంది. ఒక పక్క ఎరువులు, యూరియా కొరతతో అల్లాడిపోతుంటే పట్టించుకోవట్లేదు. అది చేశాం, ఇది చేశామంటూ గొప్పలు చెబుతుందే తప్ప.. అన్నదాత ఆక్రోశాన్ని పసిగట్టడం లేదు. ఇప్పటికే పండ్ల తోటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తల్లడిల్లిపోతున్నారు. మరో పక్క పంటలు లేక.. ప్రభుత్వం పరిహారం అందించక కష్టాల్లో కూరుకుపోయారు. వర్షం వస్తే ఆరుతడి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్న వారికి తోడుగా నిలవాల్సిన ప్రభుత్వం... యూరియా, ఎరువులను కూడా సకాలంలో సబ్సిడీపై సరఫరా చేయని తీరు ఆందోళన కలిగించే పరిణామం. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరతపై ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద అన్నదాత పోరు హోరెత్తింది.



రాయచోటి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు

ధర్నాతో దద్దరిల్లిన కలెక్టరేట్

రైతులకు సకాలంలో యూరియా, ఇతర ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ.. రైతులకు సంబంధించిన సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని అన్నదాతలతో కలసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. రైతులకు సంబంధించి అనేక సమస్యలు వెంటాడుతున్నా.. ఇప్పటికీ పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్న ప్రభుత్వ తీరుపై నేతలు మండిపడ్డారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద నేతలందరూ కింద కూర్చొని నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన నేతలు, కార్యకర్తలతో కలెక్టరేట్ బయటి ప్రాంతమంతా వైఎస్సార్‌సీపీ జెండాలు, ప్లకార్డులతో నిండిపోయింది. నినాదాలు, ధర్నాతో కలెక్టరేట్ దద్దరిల్లింది.

కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం ముగిసిన అనంతరం... వైఎస్సార్‌సీపీ కీలక నేతలు కలెక్టరేట్ ఏఓ నాగభూషణంకు వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతోపాటు ఒంటిమిట్ట మాజీ జెడ్పీటీసీ, పర్యాటక శాఖ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మదనపల్లె, రాయచోటి మున్సిపల్ చైర్‌పర్సన్‌లు మనూజారెడ్డి, ఫయాజ్ బాషా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ్‌రెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, వైఎస్సార్‌సీపీ నేత యదుభూషణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, జంగం రెడ్డి కిశోర్ దాస్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చక్రధర్, అన్నమయ్య జిల్లా పంచాయతీరాజ్ విభాగం, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గాలివీటి వీరనాగిరెడ్డి, మోడం నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు విజయభాస్కర్ తదితర నాయకులతోపాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యవసాయం దండగ అన్నోడు చంద్రబాబు :



వ్యవసాయం దండగ అన్నోడు చంద్రబాబు నాయుడు. రైతులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ ఇస్తానంటే.. తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే తప్ప ఆచరణలో సాధ్యం కాదన్నారు. కానీ వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ ఇచ్చి.. వ్యవసాయాన్ని పండుగ చేశారు.
– సురేష్ బాబు, మేయర్, కడప

భారీ ర్యాలీ

కడప – చిత్తూరు జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ వరకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు, కడప మేయర్ సురేష్‌బాబు, పీలేరు, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, పుంగనూరు, మదనపల్లె పరిశీలకురాలు అనీషారెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎర్రంరెడ్డి ఆరంరెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శ్రేణులు కదిలి వచ్చాయి. జెండాలను చేతబూని, ప్లకార్డులతో మెరుపు వేగంతో దూసుకొచ్చారు. ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్ద నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూనే ప్లకార్డులు పట్టుకుని చేస్తున్న నినాదాలు హోరెత్తాయి. యూరియా కొరతను నివారించాలని, రైతులకు వెంటనే సబ్సిడీపై ఎరువులను అందించడంతోపాటు పండ్ల తోటల రైతులకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.





ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఈ ప్రభుత్వానికి ముందు చూపు లేదు



కూటమి ప్రభుత్వానికి ఎరువులు, విత్తనాలపై కనీస ముందు చూపు లేదు. దీంతో వ్యవసాయం కూడా ముందుకు సాగకు.. రైతులు అల్లాడుతున్నారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో.. ఎరువుల కొరత లేకుండా చూశారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైనంత పంపిణీ చేశారు. – కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారు



రూ.270లు అమ్మాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌లో రూ.350- 400 వరకు విక్రయిస్తున్నారు. 50 శాతం వరకు మార్క్‌ఫెడ్ ద్వారా ఇవ్వాల్సిన యూరియాను ప్రైవేట్ వ్యాపారులకు అమ్మే విధంగా అనుమతులు ఎలా ఇచ్చారో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడే చెప్పాలి. పైగా ఆయన రైతులను అవమాన పరిచే విధంగా మాట్లాడటం విచారకరం. – చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పీలేరు

పంటలకు మద్దతు ధర ఏదీ?



కూటమి ప్రభుత్వంలో ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. మదనపల్లెలో టమాటా సాగు ఎక్కువగా ఉంటుంది. దానికి కూడా మద్దతు ధర లేకుండా పోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. – నిస్సార్ అహమ్మద్, సమన్వయకర్త, మదనపల్లె నియోజకవర్గం

అన్నదాతను ఆదుకోవడంలో విఫలం



అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. దీంతో వారు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షాన పోరాడుతున్నారు. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు రైతు పోరుకు భారీగా తరవచ్చారు. – ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, రాజంపేట

ఇప్పుడు ఉలికిపాటు



వైఎస్సార్‌సీపీ ఆందోళనకు దిగిన తరువాత ఇప్పుడు ఉలికిపడి 50 మెట్రిక్ టన్నుల యూరియా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. –ఆరెంరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నాయకులు, అన్నమయ్య జిల్లా

న్యూస్‌రీల్


ఒంటిమిట్ట హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ నెలసరి హుండీ ఆదాయాన్ని మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆదాయం రూ.3 లక్షల 85 వేల 100 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రైళ్ల స్టాపింగ్‌పై ఉత్తర్వులు



కడప కోటిరెడ్డి సర్కిల్: కరోనాకు ముందు ఉన్న పది రైల్వే స్టేషన్లలో స్టాపింగ్‌లను పునరుద్ధరిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. 16351 ఛత్రపతి శివాజీ టెర్మినల్ నాగర్ కొయిల్ రైలు రాజంపేట, కోడూరులో ఆగుతుందన్నారు. 16381, 16382 కన్యాకుమారి – పుణె, పుణె – కన్యాకుమారి రైళ్లు నందలూరు, కొండాపురంలలో, 17622 తిరుపతి – ఔరంగాబాద్ రైలు ఎర్రగుంట్లలో, 17652 కాచిగూడ చెంగల్‌పట్టు రైలు కోడూరులో, 22102 మధురై లోకమాన్య తిలక్ రైలు రాజంపేటలో స్టాపింగ్‌లు ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైల్వే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

ములకలచెరువు: సహజ ఎరువులు, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ములకలచెరువు మండలం సోంపల్లెలో నానో ఎరువులు, జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేకుండా సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. యూరియా ఎక్కువగా వినియోగించడం వల్ల భూసారాన్ని తగ్గించి భవిష్యత్తు తరాలకు నష్టాన్ని కలుగజేస్తుందని పేర్కొన్నారు. ఎక్కడైనా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, తహసీల్దారు ప్రదీప్, ఎంపీడీఓ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

ఇంటింటా చెత్త సేకరణ క్రమ తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. మండలంలోని సోంపల్లె పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో ఇవ్వాలి

రాయచోటి : ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం కాదని, వాటిని అమలు పరచడానికి జీఓను విడుదల చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి బీసీ శేఖర్, జిల్లా అధ్యక్షులు సి.ఆనందబాబు అధ్యక్షతన రాయచోటిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీవీ నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన డీఏ అరియర్స్, పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలు, కొత్త పీఆర్సీ ఇవ్వాలన్నారు. కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను తొమ్మిది నెలలుగా చెల్లించకుండా పెండింగ్ పెట్టారన్నారు. వెంటనే వాటిని చెల్లించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్పీ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.నాగభూషణంరెడ్డి, జోనల్ నాయకులు వీటీ నాథ్, జీఎస్ మన్యం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు కేవీ రమణ, జిల్లా వైస్ ప్రెసిడెంటు శరత్‌బాబు, జిల్లా కోశాధికారి కొండా ఈశ్వర్‌రెడ్డి, జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంటు వి.ప్రకాష్, జిల్లా ప్రచార కార్యదర్శి కె.చలమారెడ్డి, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఎంఎస్ వాసులు, సుగుణ, సెల్వి, మెయింటెనెన్స్ కమిటీ సభ్యులు సి.నరసింహులు, జిల్లాలో ఐదు డిపోలకు చెందిన ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య

మదనపల్లె వైద్య కళాశాలకు టెండర్

- పీపీపీ విధానంలో అప్పగిస్తామని జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ఏడాది ఫీజులో రాయితీలు ఇస్తామంటూ ప్రకటన
- టెండర్‌దారునికి భారీగా ప్రోత్సాహం



నిర్మాణంలోని మదనపల్లె మెడికల్ కళాశాల భవనాలు

మదనపల్లె: మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ప్రయివేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం తొలి అడుగు వేసింది. మదనపల్లెతోపాటు మరో మార్కాపురం, ఆదోని, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలను మొదటి విడతలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించి మంగళవారం జీవో జారీ చేసింది. ఈ అప్పగింత ప్రక్రియకు సంబంధించిన బాధ్యతలను వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం అప్పగించింది. వీటికి సంబంధించి కమర్షియల్ ఫీజిబిలిటీ అధ్యయనం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. పీపీపీ కింద నిర్వహణ బాధ్యతలు చూసేందుకు ముందుకు వచ్చే టెండర్‌దారునికి వార్షిక ఫీజులకు సంబంధించి రాయితీలు కూడా వర్తింపజేస్తున్నట్టు జీవోలో పేర్కొన్నారు. దీన్నిబట్టి చూస్తే పీపీపీ కింద మెడికల్ కళాశాలను దక్కించుకునే వారికి.. ప్రభుత్వం భారీగానే ప్రోత్సాహకాలను అందిస్తుందన్న విషయం అర్థమవుతోంది. దీనికి సంబంధించిన విధి విధానాలు, ఇతరా అంశాలను జీవోలో పొందుబరిచారు.

వద్దని వ్యతిరేకిస్తున్నా..

మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటుకు అప్పగించవద్దని ప్రజల నుంచే కాకుండా రాజకీయ పార్టీలు, సంఘాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన ఈ కళాశాలకు రూ.475 కోట్లతో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రభుత్వ ఆస్పత్రిలో నడిపించి, ప్రయివేటుకు వద్దని, సర్కారు ఆధీనంలోనే కళాశాలను నడపాలని డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదు. పరిశీలిస్తామన్న హామీ కూడా ఇవ్వలేని ప్రభుత్వం.. ఇప్పుడు నిర్ణయించినట్టుగానే ప్రయివేటుకు అప్పగింత ప్రక్రియలో భాగంగా జీవో జారీ చేయడంతో మదనపల్లె ప్రజలు తీవ్రంగా స్పందిస్తున్నారు. దీనిపై ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

రోగులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు



మాట్లాడుతున్న కడప డీఎంహెచ్‌ఓ నాగరాజు

సిద్దవటం: రోగుల పట్ల వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని కడప డీఎంహెచ్‌ఓ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఐడీ కార్డు, డ్రస్ కోడ్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కాన్పుల వార్డు, పేషెంట్ల గదులు, వ్యాక్సినేషన్‌కు సంబంధించిన గదులను తనిఖీ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే 104 వాహనం వద్దకు వచ్చే రోగులకు రక్తనమూనాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ రంగ లక్ష్మీ, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండలం పోట్లదుర్తి పరిధిలోని పెన్నానదిలో గల్లంతు అయిన చెన్నూర్ ఫయాజ్ మృత దేహం లభించిందని యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చెన్నూర్ ఫయాజ్‌తో పాటు మరికొంత మంది యువకులు సోమవారం సాయంత్రం చేపలు పట్టడానికి పెన్నానది వద్దకు వెళ్లారు. అయితే చేపలు పడుతున్న సమయంలో చెన్నూరు ఫయాజ్ (25) అనే వ్యక్తి ప్రమాదశాత్తు నదిలో పడి గల్లంతు అయ్యాడు. సమాచారం అందిన వెంటనే పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా బోటు సాయంతో సోమవారం రాత్రింతా గాలించారు. మంగళవారం ఉదయం కూడా బోటు సాయంతో పెన్నానది నీటి ప్రవహం వెంబడి గాలింపు చేశారు. హనుమనుగుత్తి గ్రామ సమీయంలో దడికి ఫయాజ్ మృతదేహం ఉండటం అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎరువు కోసం వెళ్లి వస్తుండగా..

– లారీ ఢీ కొని రైతు మృతి

చాపాడు : మైదుకూరు- ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో గల మండల పరిధిలోని ఆనంద ఆశ్రమం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమాపురం గ్రామానికి చెందిన లెక్కల లక్ష్మిరెడ్డి (65) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. లక్ష్మిరెడ్డి ఎరువుల కోసం మైదుకూరుకు వెళ్లి తిరిగి గ్రామానికి ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాత్రి 8 గంటల ప్రాంతంలో సోమాపురం క్రాస్ రోడ్డు దాటుతుండగా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుండి ప్రొద్దుటూరుకు వెళుతున్న వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మిరెడ్డి తలకు తీవ్ర గాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మోటార్ సైకిల్ నిప్పంటుకుని కాలిపోయింది. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల జాతీయ రహదారిని విస్తరణ చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడం వలన సోమాపురం వెళ్లే గ్రామస్తులు రోడ్డు దాటుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ అధికారులు చర్యలు తీసుకుని తగిన జాగ్రత్తలు ఏర్పాట్లు చేయాలని కోరుకుంటున్నారు.

టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి

ఖాజీపేట : జాతీయ రహదారి లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కె. సుబ్బయ్య (48) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే చాపాడు మండలం నాగసానిపల్లె గ్రామం వద్ద ఉన్న గుట్ట నుంచి మట్టిని టిప్పర్ ద్వారా తరలిస్తున్నారు. అందులో భాగంగా అల్లాడు పల్లె నుంచి ఖాజీపేట మండల పరిధిలోని జాతీయ రహదారి అయ్యప్ప స్వామి గుడి దగ్గరకు రాగానే ముందు వెళుతున్న బైక్‌ను టిప్పర్ ఢీ కొంది. దీంతో బైక్ పై ఉన్న సుబ్బయ్య రోడ్డు నుంచి కాలువలో పడ్డాడు. కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖాజీపేట పోలీసులు అక్కడికి చేరుకుని చనిపోయిన వ్యక్తిని కడప రిమ్స్ లోని మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తిది ప్రొద్దుటూరు గా గుర్తించారు. ఆమేరకు టిప్పర్ డ్రైవర్ జహంగీర్ ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉక్కాయపల్లె దిబ్బల సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.. వారి నుంచి రూ. 75వేలు నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

బతికి సాధిద్దాం

- ఆత్మహత్యలు వద్దు... జీవితమే ముద్దు
- జిల్లాలో ప్రతి ఏడాది పెరుగుతున్న ఆత్మహత్యలు
- ఈ ఏడాది ఎనిమిది నెలల్లో 191 మంది ఆత్మహత్య
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



రాజంపేట టౌన్ : జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే. ఒకటి గడిచిపోయిన కాలం, రెండవది ప్రాణం. ఆవేశంతో అనాలోచితంగా తీసుకునే నిర్ణయం మనిషి జీవితాన్నే చిదిమేస్తుంది. మనల్ని అమితంగా, పంచ ప్రాణంలా ప్రేమించే కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగులుస్తుంది. ఏదైనా సాధించాలనుకోవడం.. లేకుంటే గెలవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలే కాని గెలుపే జీవితం కాకూడదు. ఓడినంత మాత్రాన జీవితం వృధా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం మరొకటి లేదు. ప్రాణాలు తీసుకునే ముందు ఒక్కటంటే ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ ఏంటో తెలుస్తుంది. ఏ సమస్యకు ఆత్మహత్యకు పరిష్కారం కాదు. ఇదిలావుంటే ఆత్మహత్యలను నివారించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ సంస్థ సంయుక్తంగా 2003వ సంవత్సరం నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం

ఈ ప్రపంచంలో అత్యంత విలువైనది, వెలకట్ట లేనిది ప్రాణం. జీవితం అన్నాక ఎన్నో ఒడిదుడుకులు, సమస్యలు ఎదురవుతుంటాయి. జీవితంలో అన్నింటినీ అధిగమించి అనుకున్న విజయాన్ని సాధించాలే కానీ.. బలహీన మనస్తత్వంతో ప్రాణం తీసుకుంటే ఏం వస్తుంది.. ఏమీ రాదు.. పైగా మన కుటుంబ సభ్యులు తీవ్ర వేదనకు గురవుతారు.. ఈ విషయం గుర్తుపెట్టుకుని బతికి సాధిద్దాం అనే దిశగా ముందడుగు వేయాలి.

కాగా ఈ ఏడాది ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో 191 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. జిల్లాలో ప్రతి ఏడాది ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఎంతపెద్ద సమస్య అయినా పరిష్కరించుకునేందుకు ఏదో ఒక మార్గంలో అవకాశాలు ఉన్నాయి. అయితే చిన్నచిన్న సమస్యలకే అనేక మంది మనోస్థైర్యాన్ని కోల్పోయి బలవంతంగా తమచేతులతోనే ప్రాణాలను తీసుకుంటున్నారు. ఎంత పెద్ద సమస్య వచ్చినా మనసు కుదుటపరుచుకొని గుండెనిబ్బరంతో ఆ సమస్యను పరిష్కరించుకుని దిశగా ఓర్పుగా అడుగులు వేయాలే తప్ప బలవన్మరణానికి పాల్పడితే తమను నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించాలి. తనువు చాలించుకోవడానికి సిద్ధమయ్యాక ఒక్క క్షణం జన్మనిచ్చి కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులను, అక్క, చెల్లి, అన్నయ్య, తమ్ముడు అంటూ ఆప్యాయతతో, ప్రేమానురాగాలతో పిలిచే తోబుట్టువులను, తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే ఎంత కష్టాన్ని అయినా అలవోకగా జయించవచ్చు.

చిన్నపాటి కారణాలతో ఆత్మహత్యలు..

తల్లిదండ్రులు మందలించారని, పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేక పోతున్నామని, ప్రేమ విఫలమైందని, చివరికి తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దు అన్నందుకు కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, అనారోగ్య సమస్యలు, వ్యసనాలకు బానిసలవడం, భార్య కాపురానికి రాలేదని భర్త, భర్త కోప్పడ్డాడని భార్య ఇలా చిన్నచిన్న విషయాలకే విబేధాలు, గొడవలు, ఉద్వేగం, కుంగుబాటుకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు అధికమవుతున్నాయి. ఇలా ఆత్మహత్యకు పాల్పడేవారంతా సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, సమస్య పరిష్కారానికి కొంత సమయమైనా వేచిచూసే ఆత్మస్థైర్యం లేనందు వల్ల అర్ధాంతరంగా తనువు చాలిస్తూ కన్నవారిని, నమ్ముకున్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టుతున్నారు.

నాలుగేళ్లల్లో జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య	
2022	171
2023	233
2024	247
2025 (ఇప్పటి వరకు)	191
మొత్తం	842

ఉరుకులు పరుగులమయమైన జీవనం కూడా ఒక కారణమే..

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. కుటుంబంలో ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే పెద్దలు ఆ సమస్యను పరిష్కరించి మేమున్నాము అన్న భరోసా ఇచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. ప్రతి ఒక్కరిది ఉరుకులు పరుగులమయమై జీవనమైంది. అందువల్ల కుటుంబ సభ్యులు వారంలో ఒకరోజైనా ఒకచోట కూర్చొని సరదాగా మాట్లాడుకోలేక పోతున్నారు. ఫలితంగా ఏదైనా సమస్య వచ్చినా కుటుంబ సభ్యులతో చెప్పుకొని పరిష్కరించుకోలేక వారిలో వారే కుమిలిపోయి చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఈకింది లక్షణాలుంటే జాగ్రత్త పడాల్సిందే..

- ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారిలో కొన్ని అసాధారణ లక్షణాలు ఉంటాయి.
- ఒంటరితనాన్ని కోరుకుంటారు.
- సకాలంలో ఆహారం తీసుకోరు.
- రాత్రి వేళల్లో నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచిస్తుంటారు.
- కొన్నిమార్లు అసలు దేనికి కూడా స్పందించరు.
- బతికి ఏం లాభమని, చనిపోతే పోతుంది అని ముందుగానే పరోక్షంగా సంకేతాలిస్తారు.
- ఇలాంటి మాటలు ఎవరైనా మాట్లాడితే కుటుంబ సభ్యులు గుర్తించాలి.
- వారితో ప్రేమగా మాట్లాడి సమస్యను తెలుసుకొని పరిష్కారానికి తోడ్పాటిచ్చి తామున్నామన్న భరోసా ఇవ్వాలి.
- మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళితే ప్రయోజనం కూడా ఉంటుంది.

అవగాహన లేక పోవడం వల్లే...

సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశమే చాలా సందర్భాల్లో బలవన్మరణాలకు దారితీస్తుంది. జీవితంపై, సమస్యల పరిష్కరించుకునే విధానంపై సరైన అవగాహన లేక పోవడమే ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రధాన కారణం. ఆత్మహత్యలు చేసుకునేవారు సమస్యను తప్పించుకోవాలని చూస్తున్నారే తప్ప తమ కుటుంబ సభ్యులను మరిన్ని సమస్యల్లోకి నెట్టేస్తున్నామన్న విషయాన్ని గుర్తించలేక పోతున్నారు. తల్లిదండ్రులు కన్నబిడ్డలను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటారు, అలాంటప్పుడు కన్నబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు, జీవితాంతం మానసిక క్షోభను అనుభవిస్తారు. ఇక కుటుంబ పెద్ద ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. అందువల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ప్రాణాలు తీసుకోవడం సరైనది కాదని మానసిక నిపుణులు చెబుతున్నారు.

చావు ముందు ఎంతటి పెద్ద సమస్య అయినా చిన్నదే..



మనిషి జీవితానికి ముగింపు చావు. చావు ముందు ఎంత పెద్ద సమస్య అయినా చాలా చిన్నదే. అందువల్ల క్షణికావేశంలో ఎవరు కూడా ఆత్మహత్య చేసుకోకూడదు. ఆత్మహత్య చేసుకోవడం అంత పిరికితనం మరొకటి లేదు. ఏదైనా బతికి సాధించాలే కాని బలవంతంగా ప్రాణాలు తీసుకుంటే అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులను మానసిక క్షోభకు గురిచేసినట్లే.

– కాశిగారి ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, అన్నమాచార్య యూనివర్శిటీ, రాజంపేట

జీవితం భగవంతుడు ఇచ్చిన వరం



మనిషికి జీవితం భగవంతుడు ఇచ్చిన వరం. అందువల్ల ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదురొడ్డి నిలిచి బతికి జీవితాన్ని ఆస్వాదించాలి. అంతేకాని ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోకూడదు. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉన్నవారు మానసికంగా ప్రశాంతంగా ఉండలేరు. అలాంటి సమయంలో ఆత్మీయులతో మాట్లాడటం, వ్యాయామం, యోగా వంటివి చేస్తే మనసు కుదుటపడి మానసిక ప్రశాంతత నెలకొని ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన నుంచి బయటపడగలరు.

– జి.భానుమూర్తిరాజు, రాష్ట్ర ప్రాంతీయ వ్యాయామ విద్య తనిఖీ అధికారి

ముందస్తుగా సంకేతాలిస్తారు ..



కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా కొంత మంది ఆత్మహత్యలు చేసుకుంటారు. కొంతమంది సమస్యను ఎదుర్కోలేక తనువు చాలించాలనుకొని తల్లిదండ్రులకు, జీవిత భాగస్వామికి, పిల్లలకు, తోబుట్టువులకు జాగ్రత్తలు చెబుతుంటారు. మరికొంత మంది క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇలాంటి వారు చనిపోతానంటూ బెదిరిస్తారు. ఎవరైనా అలా మాట్లాడితే పెడచెవిన పెట్టకుండా అప్రమత్తం కావాలి. వీరైతే మానసిక వైద్యులకు చూపించాలి.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం

టపాసులు పడి బోదకొట్టం దగ్ధం



టపాసులు బోదకొట్టంపై పడటంతో అగ్నికి ఆహుతవుతున్న దృశ్యం

వీరబల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కరిముల్లా అనే వ్యక్తి బోదకొట్టం నిర్మించుకొని టీ అమ్ముకొని జీవనం సాగించేవాడు. మంగళవారం రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జ్ పదవి చేపట్టిన జగన్ మోహన్ రాజు మొట్టమొదటి సారిగా మండలానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్‌లో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహంతో టపాసులు కాల్చడంతో అవి ఆ బోదకొట్టంపై పడి పూర్తిగా కాలిపోయింది. దీంతో కరీముల్లా కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో నిరుత్సాహంగా ఉండిపోయింది. కరీముల్లా ఇటీవల వేలు ఖర్చుచేసి బోదకొట్టం ఏర్పాటు చేసుకున్నాడు.

జాతీయ స్థాయి పోటీలకు 'భారతి' విద్యార్థులు

కమలాపురం: నల్లలింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) లోని డీఏవీ భారతి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్యామ్ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విజేతల వివరాలు వెల్లడించారు. ఇటీవల విజయనగరం జిల్లాలోని రాజాం సీఎంఆర్ డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన డీఏవీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఎస్‌వీ కార్తిక్‌రెడ్డి ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే 400 మీ. పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచాడు. జావెలిన్ త్రోలో ఎం. షారూన్ కుమార్ తృతీయ స్థానంలో, 4×400 మీటర్ల పరుగు పందెంలో నరేష్, కార్తీక్, భార్గవ్, షారూన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో వైశాలి ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. జావలిన్ త్రోలో విహారిక ద్వితీయ స్థానంతో పాటు 400మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచింది. అండర్-14బాలికల విభాగంలో ట్రిపుల్ జంప్‌లో అక్షిత ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో కేవీ రుషి జావెలిన్ త్రోలో తృతీయ స్థానంలో నిలిచాడు. కాగా విజేతలుగా నిలిచిన వారిలో కార్తిక్ రెడ్డి, వైశాలి, విహారిక, అక్షిత త్వరలో జరగబో యే డీఏవీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

అత్తమామలపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

రాయచోటి జగదాంబసెంటర్ : అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న అత్తమామలపై చర్యలు తీసుకోవాలని రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న వల్లెపు అంజలి జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆరు సంవత్సరాల క్రితం వల్లెపు వెంకటసుబ్బయ్య కుమారుడు గణేష్‌తో వివాహం జరగ్గా ఇద్దరు ఆడపిల్లల సంతానం కలరన్నారు. గతంలో భర్త, మామలు తనపై దాడికి దిగగా రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు కాగా పెద్ద మనుషుల జోక్యంతో రాజీ కుదిరిందన్నారు.

తనకు గల 12 తులాల బంగారం అమ్మి ఇండ్లు కట్టుకోగా భర్త గణేష్ 18 నెలల క్రితం కువైట్‌కు జీవనోపాధి కోసం వెళ్లారన్నారు. ఈ నెల 7వ తేదీన చిన్న పాపకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మామ అయిన వెంకటసుబ్బయ్యను ఆసుపత్రికి రమ్మని పిలవగా రాకపోగా తనకు అన్న వరస అయిన వెంకట్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లి వచ్చానన్నారు. ఈ విషయమై మామ అయిన వెంకటసుబ్బయ్య నానా దుర్భాషలాడుతూ తనను కొట్టడమే కాకుండా ఇంటి నుంచి గెంటేశాడన్నారు. అత్త కూడా నాకు సహకరించడం లేదని, ఈ విషయంపై విచారించి అత్తమామలపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు అంజలి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

కూలిపోయిన బతుకులు





మృతి చెందిన కూలీలు హేమలత, దేవనాథ

తనకల్లు/ వేంపల్లె : వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు. కూలి కాస్త ఎక్కువగా వస్తుందన్న ఆశతో జిల్లాదాటి వచ్చారు. రోజంతా టమాట తొలగింపు పనుల్లో అలసిపోయారు. సూర్యుడు అస్తమించే వేళ ఆ రోజు అందిన కూలి తీసుకుని స్వగ్రామాలకు ఆటోలో పయనమయ్యారు. ఇంట్లో బిడ్డల గురించి ఒకరు, భార్య ఆరోగ్యం గురించి మరొకరు ఇలా ఆలోచిస్తూ వెళ్తున్నారు. కానీ ఆటో బోల్తా పడగా వారి జీవితాలు అక్కడే ముగిసిపోయాయి. కూలీలతో వెళ్తున్న ఓ ఆటో మండలం పరిధిలోని కొక్కంటి సమీపంలోని మించిలవారికోట రోడ్డు వద్ద బోల్తా పడడంతో వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యవసాయ కూలీలు పట్టా దేవనాథ్ (45), బత్తల హేమలత (32) మృతి చెందారు.

తిరిగి వెళ్తూ.. తిరగిరాని లోకాలకు

వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన పలువురు వ్యవసాయ కూలీలు మంగళవారం ఉదయం ఆటోలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని అగ్రహారంపల్లికి చెందిన ఓ రైతు పొలంలో టమాట కోసేందుకు వచ్చారు. పని ముగిసిన అనంతరం అదే ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. అయితే మించిలివారికోట రోడ్డు వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పడంతో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బత్తల హేమలతకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న బూరుజుపల్లికి చెందిన పట్టా దేవనాథ్, పట్టా బయన్న, శివగంగ, కొండప్పగారిపల్లికి చెందిన పెద్ద గంగులయ్య, బురుజుపల్లికి చెందిన పట్టా బయప్ప, గాయపడ్డారు. షయం తెలుసుకున్న 'వందేమాతరం టీం' సభ్యులు బాగేపల్లి అశోక్, బాలు, నవీన్, తండేల్ తదితరులు క్షతగాత్రులను తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుట్టా దేవనాథ్ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ గోపి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బత్తల హేమలతకు భర్త రామాంజనేయులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి శివగంగ, బేబీ, గణేష్‌లు అనే ముగ్గురు పిల్లలు ఉండగా తల్లి వెంట కుమార్తె శివగంగ కూడా కూలి పనులకు వెళ్లింది. శివగంగకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు దేవనాథ్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు బయప్ప, బయన్నలు ఉన్నారు. వీరు డిగ్రీ, ఇంటర్ చదువుకుంటున్నారు, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కూలీలు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఒంటిమిట్టలో విష జ్వరాలు

రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు





ఒంటిమిట్ట పీహెచ్‌సీలో రోగులతో నిండిన పడకలు, ఒంటిమిట్ట పీహెచ్‌సీలో వైద్యాధికారి గది వద్ద బారులు తీరిన రోగులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో విష జ్వరాలతో ప్రజలు కుదేలవుతున్నారు. ఈ సారి మునుపెన్నడూ లేని విధంగా ముసురు వర్షాలు పట్టుకోవడంతో వాతావరణంలో నెలకొన్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. కీటక, నీటి జనిత వ్యాధులు ప్రబలడంతో అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. పిల్లలు, పెద్దలు జ్వరాలతో వణికిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

ఇంట్లో ఒకరికి వస్తే చాలు.....

విష జ్వరాలు కారణంగా కుటుంబంలో ఒకరు జ్వరం బారిన పడితే చాలు ఆ ఇంటిల్లిపాదికి జ్వరాలు సోకుతున్నాయి. ముందుగా జలుబు, మల్లీ దగ్గు, ఆ తరువాత ఒళ్లనొప్పులు ప్రారంభమై జ్వరానికి దారితీస్తున్నాయి.

జ్వరం అని వెళ్తే జేబులు ఖాళీ చేస్తున్నారు...

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూపించుకున్న వారికి జ్వరం తగ్గకపోవడంతో వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. అక్కడ జ్వరం అని వెళ్తే ఆ టెస్టులు ఈ టెస్టులు అని రోగుల వద్ద జేబులు ఖాళీ చేస్తున్నారు.

టైఫాయిడ్ అని వెళ్తే మలేరియా ఇంజక్షన్..

ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల పరిధిలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒంటిమిట్ట ప్రజలు రోగాలకు చికిత్స చేయుంచుకుంటూ ఉంటారు. కొంత మంది టైఫాయిడ్ జ్వరం అని వెళ్తే అక్కడి డాక్టర్లు మలేరియా, టైఫాయిడ్‌కి సంబంధించిన రెండు ఇంజక్షన్లు రోగులకు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు రోజులకు ఇంజక్షన్లు రాసిస్తే ఆ ఐదు రోజులు తమ వద్దనే వేయించుకోవాలని, వేరే ఏ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేయించుకోకూడదని కండీషన్లు కూడా పెడుతున్నారు. ఇలా ప్రజల రోగాలను వ్యాపారంగా మార్చుకునే ఆసుపత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన బాధితులు.....

ఒంటిమిట్ట మండలంలో విష జ్వరాలతో ఆసుపత్రికి వస్తున్న బాధితల సంఖ్య పెరిగింది. ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజువారి ఓపీ సంఖ్య 170 మందికి పైగా వచ్చేవారు. కానీ విష జ్వరాలు పెరగడంతో 170 నుంచి 300కు చేరింది. విష జ్వరంతో వచ్చిన వారితో ఆసుపత్రిలోని పడకలు నిండిపోతున్నాయి. పడకలు చాలక సెలైన్ ఎక్కించుకునేవారు కుర్చీలోనే కూర్చొని సెలైన్ ఎక్కించుకోవాల్సి వస్తుంది. వర్షాలకు పరిసరాలు అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాప్తి చెందడంతో విష జ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో టైఫాయిడ్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒంటిమిట్ట పీహెచ్‌సీలో ఈనెల 9 వరకు నమోదైన కేసులలో వైరల్ ఫీవర్ 100కు పైనే, టైఫాయిడ్ 29 కేసులు నమోదయ్యాయి.

వాతావరణ మార్పులే కారణం...

వాతావరణ మార్పుల వల్ల విష జ్వరాల ప్రభా వం అధికంగా ఉంది. అయినా రోగులు ఆందో ళన చెందాల్సిన పనిలేదు. చికిత్స తీసుకుంటు న్న వారు త్వరగా కోలుకుంటున్నారు. రోగులు మందులు వాడటంతోపాటు రోగ నిరోధక శక్తి పెంపొందించే పండ్లు, ఆకుకూరలు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. విటమిన్-సి ఎక్కువగా ఉండే నారింజ, బత్తాయి, డ్రాగన్, కెవీ పండ్లు రసాలు శ్రేయస్కరం. కాచిన నీరు తాగాలి. విషజ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ భావన, ఒంటిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి

జ్వారాలు బెంబేలెత్తిస్తున్నాయి..



నా కొడుకులు ఇద్దరికి టైఫాయిడ్ జ్వరా లు వచ్చాయి. వారికి రెండు రోజుల పా టు ఒంటిమిట్ట ప్రైవేటు ఆసుపత్రుల్లో వై ద్యం చేయించాను. అయినా తగ్గక పోయే సరికి వారిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించాను. కేవలం నా కొడుకులకే కాదు ఒంటిమిట్టలో చాలా మందికి జ్వరాలు వచ్చాయి. చిన్నపిల్లలు, పెద్దలు చేతికి సెలైన్ పెట్టుకుని అవస్థలు పడుతు న్నారు. అధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలి.

– ఏతేశ్వరం మధుమూర్తి, ఒంటిమిట్ట గ్రామస్తులు

ఎట్టకేలకు మట్టి మాఫియా ఆటకట్టు

సాక్షి ఎఫెక్ట్..

కురబలకోట : వ్యవసాయ భూముల అభివృద్ధికి చెరువు మట్టి తోలుకోడానికి ఇచ్చిన అనుమతిని దుర్వినియోగం చేయడంతో దానిని రద్దు చేసినట్లు స్థానిక ఇరిగేషన్ ఈఈ జి. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలంలోని నార్లపల్లె చెరువులో మట్టి తోలుకోడానికి ఓ రైతు పేరుతో అనుమతి తీసుకున్నారన్నారు. అయితే వ్యవసాయ భూమికి కాకుండా రియల్టర్ భూమికి మట్టిని తోలుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. దీంతో ఆ రైతుకు ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేసినట్లు తెలిపారు. మట్టి మాఫియా దురాగతాలపై రెండు రోజులుగా సాక్షి దినపత్రికలో వార్తలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఇరిగేషన్ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి కఠిన నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ భూములకే మట్టిని తరలించాలనే షరతుతో అనుమతి ఇవ్వగా దానిని ఉల్లంఘించారన్నారు. రియల్టర్ కొమ్ముకాసి చెరువు మట్టిని తోలినట్లు విచారణలో వెల్లడైందన్నారు. చెరువు నుండి మట్టి తోలుకునే అనుమతులను రద్దు చేసి మట్టి మాఫియా ఆట కట్టించారు. అధికారులు ఇచ్చిన అనుమతిని వ్యక్తిగత లబ్ధి కోసం పక్కదారి పట్టించడం పట్ల ఆయకట్టు రైతులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి అవకాశవాదులు, నయవంచకుల ఆటలకు అధికారులు చెక్ పెట్టారు. కొంత ఆలస్యంగానైనా ఇరిగేషన్ అధికారులు తీసుకున్న చర్యలపై చెరువు ఆయకట్టు రైతులు, గ్రామస్థులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చెరువు మట్టిపై కన్నేసి అక్రమార్జనకు పాల్పడిన నాయకుల తీరును పలువురు దుయ్యబడుతున్నారు.